క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో బక్రీద్



పొన్నూరు: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని శనివారం ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఈద్గా, మసీదుల్లో (ఈద్ నమాజ్) సామూహిక ప్రార్థనలు చేశారు. అబ్దుల్ కలాం(ఇటికంపాడు) రోడ్డులోని ఈద్గాలో దాహెరా మసీదు ఇమామ్ ఈద్ నమాజ్ చేయించారు. అనంతరం బక్రీద్ విశిష్టతను, ఖుర్బానీ ప్రాధాన్యతను వివరించారు. ఈద్గాతో పాటు పట్టణంలోని మర్కస్, అక్సా, నూర్, నిమ్రా, ఆయిషా, రహిమానియా, ఉమర్, మదీనా, నూరానీ, అబూబకర్, జైనబ్, మొహమ్మదిగా, చౌక్, ఫాతిమా, దాహెరా, ఉస్మానియా, బిలాల్ మసీదుల్లో ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఈద్ ప్రార్థనలు నిర్వహించారు. నమాజ్ అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏర్పాట్లను అంజుమన్ కమిటీ పర్యవేక్షించింది.

లైంగిక దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

నెహ్రూ నగర్: అనంతపురం జిల్లాలో దళిత బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చందోలు శశి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో దళిత మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, హోం మంత్రి దళిత మహిళ అయినప్పటికీ ఈ విషయంలో స్పందించక పోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో దళిత మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

వేణుగోపాలస్వామి గ్రామోత్సవం



నగరంపాలెం: స్థానిక కొత్తపేటలోని జగన్నాథస్వామి దేవస్థాన ఆవరణలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి తులసి అలంకారం చేశారు. అనంతరం గరుడ వాహనంపై గ్రామోత్సవం, మన్యుసూక్త హోమం నిర్వహించారు. రాత్రి గుంటూరు నగర పరిసరాల్లో శ్రీ స్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమాలను దేవస్థానం ఈవో టి.సుభద్ర పర్యవేక్షించారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు..

స్థానిక లాలాపేటలోని పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి మోహిని అలంకారం చేశారు. 108 కలశలతో అష్టోత్తర సహస్ర అభిషేకాలు నిర్వహించారు. రాత్రి హనుమత్ వాహనంపై గ్రామోత్సవం జరగ్గా, భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ టి.సుభద్ర పర్యవేక్షించారు.

తెనాలిలో భారీ వర్షం

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలి: పట్టణ, పరిసరాల్లో శనివారం సాయంత్రం కొద్దిసేపు భారీ వర్షం కురిసింది. దీనికితోడు వీచిన గాలులతో వేసవి ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు వర్షంతో ఉపశమనం కలిగినా, విద్యుత్ అంతరాయంతో పరిస్థితి మొదటికొచ్చింది. బయట చల్లగా ఉన్నా ఇళ్లలో ఉక్కపోత, ఎంతకీ పునరుద్ధరించని విద్యుత్ సరఫరా కారణంగా జనం తీవ్ర అసహనానికి గురయ్యారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో వర్షం చినుకులు మొదలు కాగానే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పట్టణంలోని నందులపేట, నాజరుపేట, బుర్రిపాలెంరోడ్డు ఏరియాల్లో కరెంటు లేక అవస్థలు పడ్డారు. రాత్రి 9.30 గంటలకూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు. కరెంటు ఎప్పటికి వస్తుందో తెలుసుకుందామని ఫోన్ చేసిన వినియోగదారులకు సంబంధిత అధికారులు అందుబాటులోకి రాకపోవటంతో ఏమీ పాలుపోని పరిస్థితి నెలకొంది. ఆయా ఏరియాల్లో ఎప్పుడు చినుకులు పడినా విద్యుత్ సరఫరా ఆగిపోవటం, పునరుద్ధరణకు తీవ్ర జాప్యం జరుగుతుండటంపై స్థానికులు విమర్శిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలా జరగనేలేదని, ఇటీవలకాలంలోనే ఈ రకమైన అవస్థలు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. దీనిపై విద్యుత్ ఏడీఏ అశోక్‌ను ఫోనులో సంప్రదించగా, పట్టణంలోని గోలిడొంక, సమీప గ్రామం చక్రాయపాలెంలో ఇన్సులేటర్లు దెబ్బతిన్న కారణంగా సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. పునరుద్ధరణ ప్రయత్నాల్లో ఉన్నామని, మరో గంటన్నరకు సరఫరావస్తుందని సమాధానమిచ్చారు.

ట్యూమర్‌లను అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకం

- ఆధునిక ఆపరేషన్లతో తొలగింపు
- పిల్లల్లో, పెద్దవాళ్లలోనూ బ్రెయిన్ ట్యూమర్‌లు
- నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే



గుంటూరు మెడికల్: పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన శ్రీనాథ్ ఏడాదిగా తలనొప్పి, చూపు మసకగా కనిపించం లాంటి లక్షణాలతో పలు ఆస్పత్రులు తిరిగినా ఆరోగ్య సమస్య పరిష్కారం కాలేదు. చివరకు గుంటూరులో న్యూరోసర్జరీ వైద్యులను సంప్రదించగా తలలో గడ్డ ఉందని(బ్రెయిన్ ట్యూమర్) నిర్ధారించి, ఆపరేషన్ చేసి దాన్ని తొలగించారు. ఆధునిక జీవనశైలి వల్ల బ్రెయిన్ ట్యూమర్లు పెరిగిపోవటంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రెయిన్ ట్యూమర్‌లను సకాలంలో గుర్తించకపోవటంతో అవి ప్రాణాంతకంగా మారుతున్నాయి. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డేను నిర్వహిస్తున్నారు.

లక్షణాలు...

బ్రెయిన్‌లో సర్వసాధారణంగా సెల్స్ చనిపోయి కొత్తవి పుట్టుకొస్తుంటాయి. కొన్ని సమయాల్లో చనిపోకుండానే కొత్తకణాలు పుట్టుకొస్తాయి. కొత్తగా వచ్చిన కణాలు ట్యూమర్‌గా(గడ్డ) మారతాయి. కొన్ని క్యాన్సర్‌గా మారి ప్రాణాలు తీస్తాయి. కొన్ని ప్రమాదకరమైనవి కావు. ఆపరేషన్ చేసి తొలగించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్ ఉన్నవారిలో విపరీతమైన తలనొప్పి, వాంతులు అవ్వగానే తలనొప్పి తగ్గడం జరుగుతుంది. ఎక్కువగా ఉదయం వేళల్లో ఈ సమస్య కనిపిస్తుంది. మాట్లాడటం కష్టంగా ఉంటుంది. వినికిడి సమస్య, చూపు మసకబారటం, నడవటం కష్టంగా ఉండటం తదితర లక్షణాలు ఉంటాయి. ట్యూమర్ సైజును బట్టి, అది బ్రెయిన్‌లో ఏర్పడిన ప్రదేశం బట్టి, రకాన్ని బట్టి లక్షణాలు ఒక్కో మనిషిలో ఒక్కో రకంలా కనిపిస్తాయి.

బ్రెయిన్ ట్యూమర్‌కు కారణాలు

బ్రెయిన్ ట్యూమర్‌లు జన్యుపరలోపాల వలన, వంశపారంపర్యంగా వస్తాయి. బ్రెయిన్‌కు రేడియేషన్ సోకటం, సెల్‌ఫోన్ విపరీతంగా వాడటం వలన రేడియేషన్ సోకి మెదడులో గడ్డ వచ్చే అవకాశాలు చాలా మెండుగా ఉన్నాయి. పిల్లలు, పెద్దవారు అనే తేడా లేకుండా అన్ని వయస్సుల వారికి బ్రెయిన్ ట్యూమర్‌లు వస్తాయి.

జీజీహెచ్‌లో ఉచితంగా ఆపరేషన్లు

గుంటూరు జీజీహెచ్ న్యూరోసర్జరీ వైద్య విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలతో బ్రెయిన్ ట్యూమర్ సర్జరీలను చేస్తున్నారు. ఆపరేషన్ చేసేందుకు నాలుగు గంటల నుంచి ఎనిమిదిగంటల వరకు సమయం పడుతుంది. సుమారు మూడు లక్షల ఖరీదు చేసే ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నారు.

ఆధునిక సర్జరీలతో మెరుగైన జీవితం



బ్రెయిన్ సర్జరీలలో ఎండోస్కోపిక్ సర్జరీలు, కీహోల్ సర్జరీలు, నేవిగేషన్ గైడెడ్, మైక్రోస్కోపిక్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయి. న్యూరో సర్జరీలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతులతో బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ చేయించుకున్న వారు గతంలో కంటే చాలా మెరుగైన జీవితాన్ని గడపవచ్చు. ఆధునిక వైద్యం ద్వారా నూటికి 95శాతం రోగికి మంచి జీవితాన్ని ప్రసాదించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్స్‌లో నూటికి 10శాతం మాత్రమే ప్రాణాంతకమైనవి.

డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, న్యూరోసర్జన్, గుంటూరు

ట్యూమర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చు



న్యూరో సర్జరీలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతులతో నేడు బ్రెయిన్ ట్యూమర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించవచ్చు. ట్యూమర్‌లను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు. ప్రాథమిక దశలోనే తలలో గడ్డలను గుర్తిస్తే ఆపరేషన్లతో పనిలేకుండా మందులతో పూర్తిగా నయం చేయవచ్చు. అన్ని ట్యూమర్‌లకు ఆపరేషన్లు చేయాల్సిన పనిలేదు. జనాభాలో ఒకశాతం మంది బ్రెయిన్ ట్యూమర్స్‌తో బాధపడుతున్నారు. ప్రజలకు బ్రెయిన్ ట్యూమర్స్‌పై అపోహలు చాలా ఉన్నాయి. వాటిపై అవగాహన చాలా తక్కువగా ఉంది.

–డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు, న్యూరోసర్జన్, గుంటూరు

బాధితులకు చికిత్స ఇలా...

బ్రెయిన్ ట్యూమర్ సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం న్యూరోసర్జరీ వైద్య నిపుణులు, న్యూరాలజిస్టులను సంప్రదిస్తున్నారు. జిల్లాలో 20 మంది న్యూరోసర్జన్లు, 25 మంది న్యూరాలజిస్టులు ఉన్నారు. వారంలో ఇరువురు లేదా ముగ్గురు బ్రెయిన్ ట్యూమర్స్ సమస్యలతో వైద్యలను సంప్రదిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో న్యూరోసర్జరీ వైద్య విభాగంలో ప్రతినెలా 20 మందికి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీలు చేస్తున్నారు. న్యూరోసర్జరీ వైద్య విభాగంలో 2023లో 2,011 మంది, 2024లో 2,603 మంది, 2025 జనవరి నుంచి మే వరకు 2,626 మంది చికిత్స పొందారు. న్యూరాలజీ వైద్య విభాగంలో 2023లో 16,176 మంది, 2024లో 40, 381 మంది, 2025 జనవరి నుంచి మే నెల వరకు 20,765 మంది వివిధ రకాల బ్రెయిన్ సంబంధిత సమస్యలతో చికిత్స పొందారు.



సూర్యుడు భగ భగ..

ప్రత్తిపాడు: నాలుగు రోజుల పాటు వానలు మురిపించాయి. వాతావరణ చల్లబడింది.. హమ్మయ్య ఎండా కాలం పోయింది.. రోహిణి కార్తెలో రోళ్ల పగల్లేదు అనుకుని చల్లని చినుకులతో ప్రజలంతా కాస్తంత సేదతీరారు. కానీ రెండు రోజులుగా భానుడు ప్రతాపాన్ని చూపుడుతున్నాడు. చురచురలాడిపోతూ నిప్పులు చిమ్ముతుండటంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రజలు ఎండ దెబ్బకు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. భానుడి భగభగలకు ప్రత్తిపాడులోని గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డు ఇలా నిర్మానుష్యంగా కనిపించింది.

ఘనంగా సువర్ణ భారతి క్షేత్రం భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న స్వామీజీ

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులో వివేకానంద సెంట్రల్ స్కూలు దగ్గర నూతనంగా నిర్మించనున్న శ్రీసువర్ణ భారతీ క్షేత్రం (సరస్వతి దేవాలయం) భూమిపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు స్వామీజీల ఆధ్వర్యంలో వేదపండితులు విశేష హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి సరస్వతి దేవాలయం లక్ష పలకలతో తెనాలిలో నిర్మించటం గొప్ప విషయమని చెప్పారు. సరస్వతి దేవి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. పెద్దపులిపాక శ్రీవిజయ రాజరాజేశ్వరి శ్రీవిద్యా పీఠం పీఠాధిపతులు శ్రీవాసుదేవానందగిరి స్వామి భూమిపూజలో పాల్గొని విశేష ప్రవచనం చేశారు. విజయవాడలోని అష్టాక్షరి ఆశ్రమం నుండి శ్రీమన్నారాయణ అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి భక్తుల నుద్దేశించి మాట్లాడారు. ఇక్కడి గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం, శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం దంపతులు, టీటీడీ దాసస్వామి ప్రాజెక్టు కృష్ణ–గుంటూరు జిల్లా అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసు (వాసు), కార్యదర్శి రావూరు సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, రాజేశ్వరరావు, గొడవర్తి సాయి హరేరామ్ పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం

సీపీఎం నగర కార్యదర్శి నళినీకాంత్



మాట్లాడుతున్న నళినీకాంత్

లక్ష్మీపురం: విద్యుత్ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ పేరుతో వినియోగదారులపై ప్రభుత్వం భారం మోపుతుందని సీపీఎం నగర కార్యదర్శి కె.నళినికాంత్ పేర్కొన్నారు. బ్రాడీపేట పార్టీ కార్యాలయంలో స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ప్రచారంలో భాగంగా కరపత్రాలు, స్టిక్కర్లు, పోస్టర్లలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవానికి మీటర్ బిగించేటప్పుడే మూడు నెలల అడ్వాన్స్ బిల్లు డిపాజిట్‌గా కట్టించుకుంటూ, ప్రీ పెయిడ్ పద్ధతి తీసుకురావడం అన్యాయమని ఖండించారు. పీక్ అవర్స్‌లో స్మార్ట్ మీటర్ ద్వారా అదనపు చార్జీ వసూలు చేసేలా మరో దుర్మార్గపు ఎత్తుగడకు ప్రభుత్వం పాల్పడనుందని తెలిపారు. సాయంత్రం 6 నుంచి 10 గంటల మధ్య, ఎండాకాలంలో పగలు పూట వాడే కరెంటుకు ఎక్కువ చార్జీ వసూలు చేయడం ఈ స్మార్ట్ మీటర్ ప్రత్యేకత అని ఆరోపించారు. ఇప్పటి వరకు తక్కువ యూనిట్లు కరెంటు కాల్చే పేదవాళ్లకు తక్కువ బిల్లు వచ్చేదని, రాబోయే కాలంలో ఈ అవకాశం ఉండదని తెలిపారు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న ఈ స్మార్ట్ మీటర్ ఖర్చు రూ.15 వేలు బలవంతంగా ప్రజలతో కట్టించే ఏర్పాట్లు ప్రభుత్వం చేసిందన్నారు. 96 నెలల్లోపు ఈ బిల్లు చెల్లించాలని ఉత్తర్వులలో పేర్కొందని వివరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను, ట్రూ అప్, ఇంధన సర్దుబాటు చార్జీలను, విద్యుత్ సెకీ ఒప్పందాలను తీవ్రంగా వ్యతిరేకించిన తెలుగుదేశం నేతలు అధికారంలోకి రాగానే వాటినే కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, కె.శ్రీనివాసరావు, నగర కమిటీ సభ్యులు షేక్ ఖాశీం షహీద్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని సండే మార్కెట్‌లో వాహనం పార్కింగ్ చేసి తిరిగి వచ్చి చూసే సరికి కనిపించక పోవడంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. రెడ్డిపాలెం, యాదవ బజార్ ప్రాంతానికి చెందిన తాళ్ల వెంకటేష్, మే 12న అరండల్‌పేటలోని సండే మార్కెట్‌కు వచ్చాడు. అరండల్‌పేట 8/2వ లైన్‌లో వాహనం పార్కింగ్ చేసి తిరిగి గంట తరువాత వచ్చి చూసేసరికి కనిపించలేదు. చుట్టు పక్కలతో పాటు గుంటూరు బస్టాండ్, రైల్వే స్టేషన్ పార్కింగ్ సెంటర్‌లలో వెతుకలాడిన వాహనం కనిపించక పోవడంతో శనివారం బాధితుడు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో రూ.1.60 లక్షల మోసం

లక్ష్మీపురం: సాఫ్ట్ వేర్ సంస్థలో ఉద్యోగానికి రూ.1.60 లక్షలు చెల్లించి ఉద్యోగావకాశం కల్పించకుండా మోసం చేసిన వారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదిత్యనగర్ 2వ లైన్‌కు చెందిన ఎస్.గురు అరవింద్ అనే యువకుడు బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం వెతుకలాడుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన షేక్ సద్దాం అనే యువకుడుని సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం అవకాశం కల్పించాల్సిందిగా కోరాడు. అయితే సద్దాం సెనో టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెప్పాడు. దీంతో గురు అరవింద్ సంస్థ మేనేజర్ సుహాస్‌ను పరిచయం చేసుకుని ఉద్యోగం కోసం అడుగగా అతనితో పాటు ప్రసాద్‌రెడ్డి, హేమంత్‌కుమార్ అనే వారు ఈ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం కోసం రూ.1.80 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పడంతో గురు అరవింద్ గత ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన రూ.1.60 లక్షలు చెల్లించాడు. అప్పటి నుంచి అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. దీంతో మోసానికి గురైనట్లు గుర్తించిన గురు అరవింద్ అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



నగరంపాలెం: స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం సాయంత్రం భక్తి సంగీత విభావరి నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీవాణీ కళానికేత్ నిర్వాహకులు భాగినారాయణశాస్త్రి భక్తి గీతాలు, శ్రీఅన్నమాచార్యుల సంకీర్తనలు అలపించారు. అనంతరం దేవాలయ పాలక వర్గం భాగినారాయణశాస్త్రి బృందాన్ని సత్కరించి, స్వామి ప్రసాదాలు అందించింది.

లెదర్ పుట్‌వేర్ కాంప్లెక్స్‌లు నిర్మించాలి



దుగ్గిరాల: ప్రతి నియోజకవర్గం, మండల కేంద్రాల్లో లో లెదర్ పుట్‌వేర్ కాంప్లెక్స్‌లను ప్రభుత్వం నిర్మించాలని దుగ్గిరాల మండల చర్మకార సంఘ అధ్యక్ష్యుడు కొమ్మూరి రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. దుగ్గిరాల ఎస్సీ కమ్యూనిటీ హాలు దగ్గర శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్మకారులకు, డప్పు కళాకారులకు రూ. 2 లక్షల రుణం అందజేసి, వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ మేరకు మంత్రి నారా లోకేష్‌కి సభ్యుల సమక్షంలో తీర్మానం చేసి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బి.రాజారావు, ఎ.ధనుంజయ్, ఎస్. కోటేశ్వరరావు, కె. సుబ్బారావు, ఎస్.ప్రకాష్, నతానియేలు పాల్గొన్నారు.

ప్రతిభ అవార్డులకు విద్యార్థుల ఎంపిక



అవార్డుకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు స్వర్ణ దీక్ష, లిఖిత్, రోహిత్



అవార్డుకు ఎంపికైన ప్రత్తిపాడు శ్రీనివాస హైస్కూల్ విద్యార్థులు ముఖేష్ రెడ్డి, తరుణ్, ప్రణతిశ్రీ

ప్రత్తిపాడు: పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభ అవార్డులకు ఎంపికయినట్లు మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రమాదేవి తెలిపారు. ఎంపికైన వారిలో ముగ్గురు ప్రయివేటు పాఠశాల విద్యార్థులు కాగా ముగ్గురు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉన్నారు. ప్రత్తిపాడు శ్రీనివాస హైస్కూల్‌కి చెందిన తుమ్మపూడి ముఖేష్ రెడ్డి (586), యనమదల హైస్కూల్‌కు చెందిన గుంజి స్వర్ణ దీక్ష (585), శ్రీనివాస హైస్కూల్‌కు చెందిన కొమ్మూరి తరుణ్ పూర్ణ సాయి చైతన్య (584), శ్రీనివాస హైస్కూల్‌కు చెందిన అంబటి ప్రణతి శ్రీ (583), వంగిపురం హైస్కూల్‌కు చెందిన కూచిపూడి లిఖిత్ (579), యనమదల హైస్కూల్‌కు చెందిన రావూరి రోహిత్ (526) అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి మండల విద్యాశాఖ అధికారులు సీహెచ్. రమాదేవి, లీలారాణి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సీహెచ్. రత్తయ్య, నాగేశ్వరరావులు అభినందనలు తెలిపారు.

వట్టిచెరుకూరు మండలంలో..

ముట్లూరు హైస్కూల్ విద్యార్థి వెంకదోత్ తనూజ బాయ్ (521), సుఖవాసి రిషిత (588), అలవల పూజిత (578), ఎస్‌కె. నాగుర్ బీ (578), వట్టిచెరుకూరు హైస్కూల్‌కు చెందిన కొండమూడి అఖిల్ (588), పుల్లడిగుంట సరోజిని విద్యాలయానికి చెందిన కొర్రపాటి శ్రీ విఘ్నేష్ చౌదరి (575) ఎంపికయ్యారు.

పెదనందిపాడు మండలంలో..

పెదనందిపాడుకు నంది పాఠశాలకు చెందిన ఎన్. స్నేహిత (590), కొమ్మనబోయిన శ్రీవిద్య (585), నాగులపాడు శ్రీనివాస పబ్లిక్ స్కూల్‌కు చెందిన తుళ్లూరి శ్రీకాంత్ (588), అట్లూరి నితీష్ చరణ్ (587), ఏబీపాలెం సెయింట్ ఇగ్నేషియస్ స్కూలుకు చెందిన తోకల ఏసురాజ్ (579), గోగులమూడి హైస్కూల్‌కు చెందిన పఠాన్ ఆఫ్రిన్ (584) అవార్డులకు ఎంపికయ్యారు.

సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులతో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గంగాదేవి

ప్రత్తిపాడు: వ్యవసాయంలో సస్యరక్షణ పద్ధతులతో రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. గంగాదేవి అన్నారు. ప్రత్తిపాడులో శనివారం లాంఫారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేవీకే సీనియర్ సైంటిస్ట్ ఎం. గంగాదేవి భూసార పరీక్షలు, కొత్త వంగడాలు, సస్యరక్షణ పద్ధతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు పొగాకు సాగు, మార్కెటింగ్ వివరాలతో పాటు మిరపను ఆశిస్తున్న నల్ల తామర పురుగు గురించి వివరించారు. ఈ సందర్భంగా గంగాదేవి మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా కేంద్రం ప్రభుత్వం వికసిత్ కృషి సంకల్ప యాత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని వివరించారు. అందులో భాగంగా ఈ నెల 29 నుంచి జూన్ 12వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 700 గ్రామాల్లో 1.5 కోట్ల మంది రైతులను శాస్త్రవేత్తలు కలిసి, ఖరీఫ్ సాగుపై సలహాలు సూచనలు అందిస్తారని చెప్పారు. అనంతరం పొలంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై రైతులకు ప్రయోగాత్మకంగా తెలియజేశారు. నమో డ్రోన్ దిది పథకం కింద మహిళలకు 80 శాతం రాయితీపై డ్రోన్లు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె..అరుణకుమారి, రైతులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పన ప్రభుత్వం బాధ్యత



సుందరయ్య కాలనీలో మాట్లాడుతున్న శివాజీ

పెదకాకాని: ప్రజలకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య కాలనీ, స్వర్ణపురి కాలనీ, ఎస్టీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. గ్రామంలో ఇండ్ల స్థలాలు లేని పేదలు 2000 మంది పైన ఉన్నారని తెలిపారు. స్థలాలు ఇచ్చే వరకు దశల వారీగా పోరాటం ఉధృతం చేస్తామని చెప్పారు. పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజా రమేష్, బురదగుంట సాంబయ్య, ఆర్. వెంకటేశ్వర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

శృంగేరి శ్రీపీఠం ఉత్తర పీఠాధిపతికి అభినందనలు



పరశివానంద భారతీస్వామిని అభినందిస్తున్న యతీశ్వరులు

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 4/2వ అడ్డరోడ్డులోని శ్రీశృంగేరీ శ్రీవిరూపాక్ష శ్రీపీఠం ఉత్తర పీఠాధిపతి శ్రీపర శివానంద భారతీస్వామిని శనివారం భారతీ సంప్రదాయ యతీశ్వరులు నరసింహ భారతీ, వాసు దేవానంద భారతీ, ఆదిత్యానంద భారతీ, హంస శివానంద భారతీస్వామి, ఆధ్యాత్మిక సాధనాపరులు ఎస్వీఎస్ సోమయాజీ, లలితేంద్ర యోగి, మున్నంగి వెంకటరాయశర్మలు అభినందించారు. జగద్గురువులు పరశివానందభారతీస్వామి అనుగ్రహ భాషణం చేస్తూ శ్రీజగద్గురు ఆదిశంకరాచార్యులు నెలకొల్పిన శృంగేరీ గురు పీఠం శ్రీవిద్యారణ్య మహాస్వామి ఆశీర్వాద బలంతో విజయనగర సామ్రాజ్యం 25 ఏళ్లు అవిచ్ఛిన్నంగా పాలించబడిందని తెలిపారు. కార్యక్రమంలో పీఠం కార్యదర్శి గబ్బిట శివరామకృష్ణప్రసాద్, సభ్యులు బి.ఎస్.ఆర్. కృష్ణప్రసాద్, ఎంఆర్‌కే.పరమహంస, యాబలూరి లోకనాథశర్మ, చింతలపాటి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

రజక కమ్యూనిటీ హాల్ కేటాయించాలి

ఎమ్మెల్యే మాధవికి వినతి



ఎమ్మెల్యే గల్లా మాధవికి వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘ నాయకులు

లక్ష్మీపురం: రజక కమ్యూనిటీ హాల్, వివిధ సామాజిక కుటుంబ ఫంక్షన్ హాల్‌కు స్థలం కేటాయించాలని రాష్ట్ర రజక సంఘం ఉపాధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు తెలిపారు. గుంటూరులోని పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గల్లా మాధవికి రజక సంఘ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రజక సామాజిక వర్గానికి ఫంక్షన్ హాల్ లేక పోవడం వలన ఆర్థిక స్తోమత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నగరపాలక సంస్థ ద్వారా తీర్మానం ఆమోదించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. నగరంలోని అనేక ప్రాంతాలలో తమ సామాజిక వర్గానికి చెందిన వారు నివసిస్తున్నారని, వారికి ఇంటి నివాస స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు హైకోర్టు న్యాయవాది తుమ్మలపూడి శ్రీధర్, సంఘం జిల్లా అధ్యక్షులు మందూరు వెంకట నరసయ్య, జిల్లా కోశాధికారి వెంపాటి చిన్న కొండయ్య, నగర అధ్యక్షులు బెండమూరి లంక కైలాసం, భాస్కరరావు, లంక సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.